

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 21-09-2025 | సంపుటి - 27 | సంచిక - 130 | రూ : 4 | పేజీలు: 8

## స్థానిక ఎన్నికలకు
# వెళ్లడమే ఉత్తమం..!



- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రుల సూచన
- 42 శాతం రిజర్వేషన్ల కోసం వెంటనే జీవో జారీకి కసరత్తు
- 3, 4 రోజుల్లో మరోసారి చర్చించి తుది నిర్ణయం

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమమని సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అందుబాటులో ఉన్న మంత్రులతో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం అంతర్గతంగా చర్చించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలకు వెళ్లడమే మంచిదని అత్యధిక మంది మంత్రులు అభిప్రాయపడ్డారని పార్టీవర్గాలు తెలిపాయి. అయితే, తుది నిర్ణయాన్ని సీఎంకే వదిలేసినట్లు సమాచారం. తరువాయి 2లో



# ఢిల్లీ ఆకాశంలో అగ్నిగోళం

- తెల్లవారుజామున కనిపించిన వింత కాంతులు
- వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్థానికులు
- ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లోనూ కనిపించిన దృశ్యం
- భూ వాతావరణంలోకి ప్రవేశించిన ఉల్కగా అనుమానం
- దీన్ని 'బోలైడ్' అంటారని చెబుతున్న శాస్త్రవేత్తలు

దేశ రాజధాని ఢిల్లీ శనివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరంలోని 100కు పైగా పాఠశాలలకు ఏకకాలంలో బాంబు బెదిరింపులు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ హెచ్చరికలతో అప్రమత్తమైన తరువాయి 2లో



## తెలంగాణ ఆడబిడ్డలకు
# బతుకమ్మ శుభాకాంక్షలు

- ప్రకృతిని ఆరాధించే గొప్ప వేడుకగా అభివర్ణన
- రాష్ట్ర ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని వెల్లడి
- తొమ్మిది రోజుల పాటు వేడుకలు వైభవంగా జరపాలని ఆకాంక్ష



2లో

## తిరుమల భక్తులకు
# శుభవార్త..
## రాజమండ్రి నుంచి నేరుగా తిరుపతికి విమానం

- రాజమండ్రి-తిరుపతి మధ్య కొత్తగా విమాన సర్వీసు
- అక్టోబర్ 1 నుంచి సేవలు ప్రారంభించనున్న అలయన్స్ ఎయిర్
- వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శని) అందుబాటులో
- ఎంపీ పురందేశ్వరి చొరవతో ఈ సర్వీసు ఏర్పాటు

## ఢిల్లీలో 100కి పైగా స్కూళ్లకు
# బాంబు బెదిరింపులు..

- శనివారం ఉదయాన్నే ఈ-మెయిల్ ద్వారా వచ్చిన హెచ్చరికలు
- స్కూళ్లను ఖాళీ చేయించి రంగంలోకి దిగిన పోలీసులు
- 'టెర్రరైజర్స్111' గ్రూపు పనేనని అనుమానం
- అంతా తనిఖీ చేసి ఉత్త బెదిరింపులేనని నిర్ధారణ

దేశ రాజధాని ఢిల్లీ శనివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరంలోని 100కు పైగా పాఠశాలలకు ఏకకాలంలో బాంబు బెదిరింపులు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు తరువాయి 2లో



## నటనా వైవిధ్యానికి, ప్రతిభకు నిలువుటద్దం మోహన్ లాల్: ప్రధాని మోదీ

- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్‌కు ప్రధాని మోదీ అభినందనలు
- మోహన్‌లాల్ ప్రతిభ, నటనలో వైవిధ్యానికి ప్రతీక అని కొనియాట
- మలయాళంతో పాటు తెలుగు, తమిళ చిత్రాల్లోనూ అద్భుతంగా నటించారని ప్రశంస
- కేరళ సంస్కృతి పట్ల ఆయన నిబద్ధత గొప్పదని కితాబు
- ఆయన విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్ష



2లో

## అలర్ట్... ఏపీలో రాగల 3 గంటల్లో
# పిడుగులతో కూడిన వర్షాలు

- ఏపీలోని 10 జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- రాగల మూడు గంటల పాటు పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షా లు
- ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ వర్ష సూచన
- అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో మోస్తరు వర్షా లకు అవకాశం
- చెట్ల కింద, హోర్డింగుల వద్ద ఉండవద్దని ప్రజలకు కీలక సూచనలు

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల ప్రజలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అప్రమత్తం చేసింది. రానున్న మూడు గంటల వ్యవధి అత్యంత కీలకమని, పది జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే ప్రమాదం ఉందని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది.



తరువాయి 2లో

# వారిని ఆదుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం: సీఎం చంద్రబాబు

ఉల్లి సాగు చేసే ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా ఈ నిర్ణయం తీసుకున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సహాయం అందిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ధరల పతనంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తున్న రైతులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. రైతులు తమ పంటను ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని, వారి పంట అమ్మకాలతో సంబంధం లేకుండానే 'ఈపంట' ఆధారంగా ఈ ఆర్థిక సహాయాన్ని నేరుగా అందిస్తామని ప్రభుత్వం వివరించింది. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే సిద్ధాంతాన్ని మా ప్రభుత్వం బలంగా నమ్ముతుంది. అందుకే అన్నదాతలకు ఏ కష్టం వచ్చినా ఒక అడుగు ముందుకేసి అండగా నిలుస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత 15 నెలల కూటమి ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, అనేక సందర్భాల్లో వారిని ఆదుకున్నామని సీఎం గుర్తుచేశారు. తమ హయాంలో రైతుల సమస్యలపై వేగంగా స్పందించినట్లు తెలిపారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.3,200 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, మద్దతు ధర లేక ఇబ్బంది పడిన మామిడి రైతులను రూ.260 కోట్లతో ఆదుకున్నామని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పతనమైనప్పుడు హెచ్‌డీ పొగాకు రైతులను రూ.271 కోట్లతో, కోకో గింజల రైతులకు రూ.14 కోట్లు ఖర్చు చేసి కిలోకు రూ.50 చొప్పున చెల్లించి భరోసా కల్పించామని పేర్కొన్నారు. అదేవిధంగా, కాఫీ పంటకు బెర్రీ బోరర్ వ్యాధి సోకినప్పుడు గిరిజన రైతులకు కేజీకి రూ.50 నష్టపరిహారం అందించామని, టమాటా రైతులు నష్టపోకుండా ఉండేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.12 కోట్లతో పంటను కొనుగోలు చేశామని చంద్రబాబు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని, కేవలం 15 నెలల కాలంలోనే ధాన్యం సేకరణకు రూ.13,500 కోట్లు ఖర్చు చేశామని ఆయన వివరించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ సూచనలు పాటిస్తూ, డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

## నటనా వైవిధ్యానికి, ప్రతిభకు నిలువుటద్దం మోహన్ లాల్: ప్రధాని మోదీ

భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన ప్రముఖ నటుడు మోహన్‌లాల్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనను అభినందిస్తూ, మోహన్‌లాల్ ప్రతిభకు, నటనలో వైవిధ్యానికి నిలువుటద్దం అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, దశాబ్దాలుగా సాగిన మోహన్‌లాల్ కళా ప్రస్థానం ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. మలయాళ సినిమా, నాటకరంగంలో ఆయన ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం మలయాళానికే పరిమితం కాకుండా తెలుగు, తమిళం, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా ఆయన అత్యుత్తమ నటనను ప్రదర్శించారని గుర్తుచేశారు. కేరళ సంస్కృతి పట్ల మోహన్‌లాల్‌కు ఉన్న నిబద్ధత ప్రశంసనీయమని ప్రధాని మోదీ తెలిపారు. సినిమా, నాటకరంగం వంటి విభిన్న మాధ్యమాల్లో ఆయన ప్రదర్శించిన అద్భుతమైన ప్రతిభ నిజంగా స్ఫూర్తిదాయకమని అన్నారు. మోహన్‌లాల్ సాధించిన విజయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ప్రధాని ఆకాంక్షించారు.

## ఢిల్లీలో 100కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు వెంటనే పాఠశాలలను ఖాళీ చేయించి, విస్తృత తనిఖీలు చేపట్టారు. చివరకు ఇవన్నీ ఉత్తి బెదిరింపులేనని తేలడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 6:10 గంటల సమయంలో 'టెర్రరైజర్స్111' అనే గ్రూపు నుంచి పలు పాఠశాలలకు ఈమెయిల్స్ అందాయి. 'మీ భవనంలో బాంబులు పెట్టాం.. స్పందించకపోతే విపత్తు తప్పదు' అనే సబ్జెక్ట్‌తో ఈ మెయిల్స్ పంపారు. గతంలోనూ ఇదే గ్రూపు నుంచి ఇలాంటి బెదిరింపులు వచ్చినట్లు పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ సమాచారం అందిన వెంటనే దిల్లీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, బాంబు నిర్వీర్య దళాలు రంగంలోకి దిగాయి. ద్వారకలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్), కృష్ణా మోడల్ పబ్లిక్ స్కూల్, సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్, నజఫ్‌గఢ్‌లోని మాతా విద్యా దేవి పబ్లిక్ స్కూల్‌తో పాటు అనేక పాఠశాలలకు బృందాలు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా విద్యార్థులను, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాఠశాల ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "మేము స్కూళ్లలో పూర్తిస్థాయిలో సోదాలు నిర్వహించాం. ఎలాంటి ప్రమాదకర వస్తువులు దొరకలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై పాఠశాలల వద్దకు చేరుకోవడంతో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకే ఈ బెదిరింపులకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై దర్యాప్తు ప్రారంభించారు.

## తిరుమల భక్తులకు శుభవార్త... రాజమండ్రి నుంచి నేరుగా తిరుపతికి విమానం

ఆంధ్రప్రదేశ్‌లో రెండు ముఖ్య నగరాలైన రాజమండ్రి, తిరుపతి మధ్య విమానయాన సేవలు అందుబాటులోకి రానున్నాయి. దసరా పండగ సమీపిస్తున్న వేళ ప్రయాణికులకు ఇది శుభవార్త కానుంది. ఎంపీ పురందేశ్వరి ప్రత్యేక చొరవతో ఈ కొత్త సర్వీసును ఏర్పాటు చేసినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని ఏపీడీ ఎన్‌కే శ్రీకాంత్ వెల్లడించారు.

*** వారానికి మూడు రోజులు.. షెడ్యూల్ ఇదే**

ప్రముఖ విమానయాన సంస్థ అలయన్స్ ఎయిర్ ఈ సర్వీసులను నడపనుంది. వారంలో మూడు రోజుల పాటు, అంటే ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ప్రతిరోజూ ఉదయం 7:40 గంటలకు తిరుపతిలో విమానం బయలుదేరి 9:25 గంటలకు రాజమండ్రి చేరుకుంటుంది. తిరిగి రాజమండ్రిలో ఉదయం 9:50 గంటలకు బయలుదేరి 11:15 గంటలకు తిరుపతికి చేరుతుందని అధికారులు వివరించారు. ఈ కొత్త సర్వీసుతో రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

**ఏపీలో మెరుగవుతున్న ఎయిర్ కనెక్టివిటీ**

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విమాన సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. కేవలం మూడు నెలల వ్యవధిలోనే పలు కొత్త సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇటీవల విశాఖపట్నం నుంచి విజయవాడకు, జులైలో కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీసులు మొదలయ్యాయి. అదేవిధంగా, జూన్ నెలలో విజయవాడబెంగళూరు, విశాఖభువనేశ్వర్, విశాఖపట్నంఅబుదాబి మధ్య కూడా కొత్త విమానాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాలతో రాష్ట్రంలోని ప్రధాన నగరాల మధ్య, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా కనెక్టివిటీ మెరుగుపడుతోంది.

## అలర్ట్... ఏపీలో రాగల 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏపీఎస్డీఎంఏ వెల్లడించిన వివరాల ప్రకారం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే సమయంలో, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో పాటు మోస్తరు వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో, విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. "ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ చెట్ల కింద ఆశ్రయం పొందవద్దు. బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన కోరారు.

## తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు, మహిళల ఔన్నత్యానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, కష్టసుఖాలను కలిసి పంచుకునే వారి సామూహిక జీవన విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆడపడుచులందరూ ఈ పూల పండుగను సంతోషంగా, కలిసికట్టుగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ తొమ్మిది రోజుల ఉత్సవాలను రాష్ట్ర ప్రజలందరూ ఆటపాటలతో ఘనంగా నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## యూరప్ లోని ప్రధాన విమానాశ్రయాలపై భారీ సైబర్ దాడి

యూరప్‌లోని పలు కీలక విమానాశ్రయాలపై జరిగిన భారీ సైబర్ దాడితో విమానయాన సేవలు అస్తవ్యస్తంగా మారాయి. లండన్ హీత్రో, బ్రసెల్స్, బెర్లిన్ వంటి ప్రధాన విమానాశ్రయాలు ఈ దాడి ప్రభావానికి గురవడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీలకమైన ఆన్‌లైన్ వ్యవస్థలు కుప్పకూలడంతో అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, మరికొన్నింటిని రద్దు చేశారు. సైబర్ నేరగాళ్లు విమానాశ్రయాల సర్వీస్ ప్రొవైడర్లను లక్ష్యంగా చేసుకోవడంతో చెక్ ఇన్, బోర్డింగ్ వంటి ముఖ్యమైన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా, బ్రసెల్స్ విమానాశ్రయంలో ఆటోమేటెడ్ చెక్‌ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లు పూర్తిగా పనిచేయడం లేదని అక్కడి అధికారులు తెలిపారు. దీంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సైబర్ దాడి కారణంగా విమానాల రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయని అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల తాజా సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థల వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచించారు. ఈ సమస్యపై విమానాశ్రయ అధికారులు స్పందిస్తూ, "మా సాంకేతిక బృందాలు సిస్టమ్‌లను పునరుద్ధరించేందుకు నిరంతరం పనిచేస్తున్నాయి. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. ఇప్పటికే విమానాశ్రయాలకు చేరుకున్న ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా వారు వెల్లడించారు. ఈ సంఘటన యూరప్‌లోని విమానాశ్రయాల సైబర్ భద్రతలోని లోపాలను మరోసారి ఎత్తిచూపింది. ఇటీవల జపాన్ ఎయిర్‌లైన్స్‌పై కూడా ఇలాంటి దాడే జరిగినట్లు తెలుస్తోంది.

## ఢిల్లీ ఆకాశంలో అగ్నిగోళం... వైరల్ అవుతున్న వింత కాంతులు

(మొదటిపేజీ తరువాయి)

కనిపించి మాయమైంది. ఈ అనూహ్య పరిణామంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన కొందరు వెంటనే తమ ఫోన్లలో వీడియోలు, ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. తమ జీవితంలో ఇలాంటిదాన్ని ఎప్పుడూ చూడలేదని, ఇది ఓ అద్భుతమైన అనుభవమని పలువురు నెటిజన్లు కామెంట్లు చేశారు. ఢిల్లీఎన్‌సీఆర్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో కూడా ఈ కాంతి పుంజం కనిపించినట్లు సమాచారం. ఈ ఘటనపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ మొదలైంది. కొందరు దీనిని ప్రకృతి అద్భుతంగా అభివర్ణించగా, మరికొందరు ఇంత తక్కువ సమయంలో అంతమంది ఎలా వీడియోలు తీయగలిగారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉల్కాపాతమేనంటున్న నిపుణులు. ఈ వింత వెలుగులపై ఖగోళ శాస్త్రవేత్తలు స్పందించారు. ఇది 'బోలైడ్' అనే ఉల్క అయివుండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. భూ వాతావరణంలోకి అత్యంత వేగంగా ప్రవేశించినప్పుడు ఘర్షణ కారణంగా ఉల్కలు మండిపోయి ముక్కలై ఇలాంటి కాంతిని వెదజల్లుతాయని వారు వివరించారు. అమెరికన్ మెటియర్ సొసైటీ ప్రకారం, సెప్టెంబర్ నెలలో అప్పుడప్పుడు ఇలాంటి ఉల్కాపాతాలు కనిపించడం సాధారణమేనని తెలిపారు. ఇలాంటి ఖగోళ సంఘటనలు అరుదు కాకపోయినా, నగర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించడం ప్రజల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తుందని నిపుణులు పేర్కొన్నారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంచుతూ ట్రంప్ నిర్ణయం.. తొలిసారిగా స్పందించిన భారత ప్రభుత్వం

హెచ్ 1బీ వీసా వార్షిక రుసుమును ట్రంప్ ప్రభుత్వం భారీగా పెంచడంపై భారత ప్రభుత్వం స్పందించింది. ఈ నిర్ణయం వల్ల కలిగే పరిణామాలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని భారత విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయం అనేక కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇది మానవతా సంక్షోభానికి దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, భారత్ దేశాల మధ్య సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలకు నైపుణ్యం కలిగిన నిపుణుల రాకపోకలు ఎంతగానో దోహదపడ్డాయని గుర్తు చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాల దృష్ట్యా ఈ విషయంపై సంప్రదింపులు జరుపుతామని ఆశాభావం వ్యక్తం చేసింది. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ టెక్ నిపుణులకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్ 1బీ వీసా వార్షిక రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు (సుమారు రూ. 83 లక్షలు) పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. వలసలపై కఠిన ఆంక్షలలో భాగంగా శుక్రవారం ట్రంప్ ఈ చరిత్రాత్మక ప్రకటనపై సంతకం చేశారు. ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ ఉద్యోగులపై, ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న వారిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇప్పటివరకు హెచ్ 1బీ వీసా రుసుము 1,000 నుంచి 5,000 డాలర్ల మధ్య ఉండేది. కానీ ఇప్పుడు ఒకేసారి లక్ష డాలర్లకు పెంచడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. అమెరికాలో ప్రస్తుతం హెచ్ 1బీ వీసాలు కలిగిన వారిలో 71 శాతం మంది భారతీయులే ఉన్నారు. సుమారు 3 లక్షల మంది మనవాళ్లు ఈ వీసాలపై అక్కడ పనిచేస్తున్నారు. తాజా విశ్లేషణ ప్రకారం, ఈ కొత్త రుసుము హెచ్ 1బీ వీసాపై కొత్తగా ఉద్యోగంలో చేరేవారి సగటు వార్షిక వేతనం కంటే ఎక్కువ. అలాగే, ఇప్పటికే పనిచేస్తున్న వారి సగటు వార్షిక వేతనంలో 80 శాతానికి పైగా ఉండటం గమనార్హం. దీంతో ఈ కార్యక్రమాన్ని దాదాపు రద్దు చేసినట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జిహాదీ గ్రూపులకు మరింత బలం! కలవరపెడుతున్న సౌదీపాక్ డీల్

సౌదీ అరేబియా, పాకిస్థాన్ మధ్య కుదిరిన తాజా వ్యూహాత్మక రక్షణ ఒప్పందం భారత్‌లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఒప్పందం కారణంగా పాకిస్థాన్ సైన్యానికి, భారత్‌ను లక్ష్యంగా చేసుకునే జిహాదీ గ్రూపులకు మరింత ధైర్యం వచ్చే ప్రమాదం ఉందని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్‌పాకిస్థాన్ మధ్య ఉన్న సమస్యల మూలాలు సౌదీకి తెలిసినప్పటికీ, ఈ ఒప్పందం పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చని విశ్లేషిస్తున్నారు. ఈ ఒప్పందంలోని ఒక కీలకమైన నిబంధన భారత్‌ను ఎక్కువగా కలవరపెడుతోంది. దాని ప్రకారం, సౌదీ లేదా పాకిస్థాన్‌పై దాడి జరిగితే, దానిని తమపై జరిగిన దాడిగా రెండో దేశం పరిగణిస్తుంది. ఈ అంశంపై భారత్ తక్షణమే స్పందించి, తన జాతీయ భద్రతతో పాటు ప్రాంతీయ స్థిరత్వంపై దీని ప్రభావం గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని భారత మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వల్ సిబల్ తెలిపారు. 'ఇండియా నెరేటివ్' అనే పత్రికలో రాసిన ఒక వ్యాసంలో ఆయన ఈ విశ్లేషణ చేశారు.

## స్థానిక ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం!

(మొదటిపేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేలా వెంటనే జీవో జారీ చేసే దిశగా కసరత్తు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియపై స్పష్టత తీసుకుని.. 3, 4 రోజుల్లో మరోసారి సీఎం, మంత్రులు సమావేశమై ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. బీసీ రిజర్వేషన్ల బిల్లులను గవర్నర్‌కు పంపినా ఇంతవరకు ఆమోదం పొందలేదు. గతంలో పంపిన బిల్లులపై కేంద్రం నుంచి కూడా స్పందన లేదు. బిల్లుల ఆమోదానికి భాజపా రాజకీయ కారణాలతో సహకరించదని, ఎన్నికలను వాయిదా వేయడం వల్ల ఉపయోగం ఉండదని కొందరు మంత్రులు చెప్పినట్లు సమాచారం. బిల్లుల ఆమోదంతో సంబంధం లేకుండా రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వమే జీఓ జారీ చేసి... ఎన్నికలకు వెళ్లేందుకు ఉన్న అవకాశాలను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. ఒకవేళ న్యాయపరమైన అవరోధాలు ఎదురైతే పార్టీపరంగా బీసీలకు 42% టికెట్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ చర్చించినట్లు సమాచారం.

# సిపిఐ జాతీయ మహాసభలకు తొమ్మిది మంది ప్రతినిధులు

* **కేంద్రపరిధిలోని జిల్లా సమస్యలను తీర్మానంగా ప్రవేశపెడతాం**
* **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఈ నెల 21 నుంచి ఐదు రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్లో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తొమ్మిది మందికి అవకాశం లబించింది. ఎంపికైన ప్రతినిధులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, నరాటి ప్రసాద్, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్ శనివారం చండీఘర్కు బయలుదేరివెళ్లారు, రాష్ట్ర పార్టీ కోటానుంచి కొత్తగూడెంకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రతినిధిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలోని కోల్బెల్ట్ ప్రాంతాల్లో ప్రతిపాదనలో వున్న నూతన బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అదేవిధంగా మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీపథకం, వన్ ఆఫ్ సెవెంటీ చట్టం అమలు, కార్మిక చట్టాల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాతంలో గిరిజన, గిరిజనేత పేదల భూ సమస్యలు, విమానాశ్రయం, జిల్లాలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు వంటి వాటిపై జిల్లా తరుపున తీర్మానం ప్రవేశపెడతామని తెలిపారు.

## ఘనంగా స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమం




మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ నగర పాలక సంస్థ" యందు శనివారం " స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగముగా జిల్లా ప్రభుత్వ పాఠశాల యందు (జెడ్. పి. ఎచ్.ఎస్) యందు ఇట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో మొదటగా విద్యార్థులకు నిర్వహించిన స్వచ్ఛత పైన వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు కమీషనర్ ఎ. శైలజా బహుమతులు అందజేశారు. చివరాగ స్వచ్ఛతను పాటిస్తామని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ స్టాఫ్ ప్రతిజ్ఞ చేశారు.

## లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరచాలి

**: డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ రావు**

* **నూతనంగా జిన్నారం,గడ్డపోతారం లయన్స్ క్లబ్ ఏర్పాటు**
* **ప్రకాష్ చారి,ఆనంద్ క్లబ్ ఛైర్మెన్ గా బాధ్యతలు**




జిన్నారం,ప్రజాస్ఫూర్తి 20: సేవచేయాలంటే లయన్స్ క్లబ్ మంచి మార్గమని, లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పర్చాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ రావు అన్నారు. జిన్నారం, గడ్డపోతారం మున్సిపాలిటీల నూతన క్లబ్ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాగుణం కలిగి ఉండాలన్నారు.లయన్స్ క్లబ్ ద్వారా సేవచేయడం సంతోషకరమన్నారు. నూతనంగా ఏర్పాటైన క్లబ్ లు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలో బెస్ట్ క్లబ్ లు ఎదగాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ లయన్స్ క్లబ్ స్నేహబంధు ఛైర్మెన్ రాఘవేంద్ర రావు, జనరల్ సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

* **జిన్నారం మున్సిపల్ లయన్స్ క్లబ్ ఛైర్మెన్ గా ఆనంద్**

నూతనంగా ఏర్పాటైన జిన్నారం మున్సిపల్ లయన్స్ క్లబ్ ఛైర్మెన్ గా సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు.సెక్రటరీ గా గంగు రమేష్, ట్రెజరర్ గా ప్రభాకర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ గా కరుణసాగర్ రెడ్డి లు బాధ్యతలు సేకరించారు.

* **గడ్డపోతారం లయన్స్ క్లబ్ ఛైర్మెన్ గా ప్రకాష్ చారి**

గడ్డపోతారం మున్సిపల్ లయన్స్ క్లబ్ ఛైర్మెన్ గా ప్రకాష్ చారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పెంటేష్, సెక్రటరీగా బాశెట్టిగారి శ్రీధర్, ట్రెజరగా దండే శ్రవణ్ బాధ్యతలు స్వీకరించారు.

## ప్రతిభ విద్యానికేతన్ లో బతుకమ్మ సంబరాలు



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 20: మండల కేంద్రమైన జిన్నారంలో ని ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ లో శనివారం సాంప్రదాయ పూల పండుగ బతుకమ్మ సంబరాలను విద్యార్థులు అధ్యాపకులు ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మను అందంగా అలంకరించి ఆటపాటలతో బతుకమ్మ ఉత్సవాలను ఆనందభరితంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి చరిత్ర వారసత్వానికి ప్రతీకలన్నారు. ప్రతిభా పాఠశాలో విద్యార్థులునిర్వహించిన బతుకమ్మ సంబరాలు పలువురుని విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## తెలంగాణ మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ

* **శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు**




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు. తిరొక్క పువ్వులను పూజించే బతుకమ్మ సంబురాలు శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, ఉపాధ్యాయురాళ్ళు పాఠశాల ఆవరణలో బతుకమ్మలను రంగురంగుల పూలతో పేర్చి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు సాగె బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ ప్రత్యేక పండుగ అని అన్నారు. విద్యార్థులకు ప్రతి పండుగ విశిష్టత తెలియజేసేలా పాఠశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులు పండుగల గొప్పతనాన్ని తెలుసు కుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బిర్రు శోభారాణి, ఉపాధ్యాయులు ,విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మౌలిక వసతులు అందించడమే లక్ష్యం

* **మాజీ మేయర్ అమర్ సింగ్**

మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలకు మౌలిక వసతులు అందించడమే లక్ష్యమని మాజీ మేయర్ అమర్ సింగ్ అన్నారు. పోచమ్మకుంటలో సిసి రోడ్ , పార్వతాపూర్ (ఔరోరా కాలేజ్ వద్ద) ఎస్ఎన్డిపి పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నివాసితులతో మాట్లాడి, జరుగుతున్న పనులపై అభిప్రాయాలు సేకరించి, పనుల నాణ్యత , పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పౌర మౌలిక వసతులు అవసరమన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పనులు సమయానికి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయ్యాక కాలనీ ప్రజలకు రవాణా సౌలభ్యం కల్పించారు. ఈ తనిఖీ ద్వారా కాంట్రాక్టర్లపై బాధ్యత కల్పించి, పౌరులకు దీర్ఘకాలిక ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత బోడిగె కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్ సుబాష్ నాయక్, శ్రీ వీరాంజనేయులు దేవాలయం మేడిపల్లి ఛైర్మన్ రామ్ రెడ్డి, కాలనీ నివాసితులు, సీనియర్ నాయకులు, హెచ్ఎండిఎ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ ను వినియోగించుకోవాలి

* **మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ ను వినియోగించుకోవాలని మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి అన్నారు.సుభాష్ నగర్ డివిజన్ లో స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని శనివారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లలు అందరు వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళలకు బీపీ, షుగర్ , స్క్రీనింగ్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. యువతులకు, మహిళలకు అనీమియా పరీక్షలు నిర్వహించడంతోపాటు తగిన కౌన్సెలింగ్ అందిస్తారని పేర్కొన్నారు. క్షయ పరీక్షలతోపాటు గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడమే కాకుండా ఈ శిబిరాల్లో గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. మహిళలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరనాజ్, స్పెషలిస్ట్ డాక్టర్ అంజలి మాధురి, ల్యాబ్ టెక్నీషియన్ బి రమేష్, ఫార్మసిస్ట్ నవీన్ , ఏఎన్ఎం రాజేశ్వరి , మహిళలు స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాంధీ నగర్ ఐలా అభివృద్ధికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పారిశ్రామిక వాడలో మౌళిక వసతుల కల్పనకు, అభివృద్ధికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ "గాంధీ నగర్ ఐలా" నూతన కార్యవర్గం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గాంధీ నగర్ పారిశ్రామికవాడ నూతన కార్యవర్గం సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా ఛైర్మన్ పి. స్వామి గౌడ్, కార్యదర్శి వి. రవీందర్ రావు, సంయుక్త కార్యదర్శి టి.సుధాకర్, సభ్యులు వై.జగదీష్, ఎం.సురేష్, అఖిల్, శివకుమార్ తయాల్, శివార్జున్, భదృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

* **మాజీ ఏంపిటీసి టి. బాలయ్య**
* **కన్సాన్పల్లి పాఠశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం**



అందోలు, ప్రజాస్ఫూర్తి : మొక్కలు నాటడంలో ప్రతి పౌరుడి క్రియాశీకల భాగస్వామ్యం అవసరమని మాజీ ఏంపిటిసి బాలయ్య అన్నారు.శనివారం అందోలు మండల పరిధిలోని కన్సాన్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక్ పేడ్.. మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమ్మ పేరిట మొక్క నాటే కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.నాటిన మొక్కలను విద్యార్థులు సంరక్షించాలన్నారు. ప్రతి పౌరుడు 'ఏక్ పేడ్.. మాకే నామ్' అనే నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలన్నారు. మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మొక్కలు నాటడంవల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించినవారమవుతామని చెప్పారు. వాతావరణ స మతుల్యాన్ని కాపాడుతూ భావితరాలకు సహజ సిద్ధమైన వాయువును అందించేందుకు రాష్ట్ర ప్రభు త్వం వన మహోత్సవం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ముక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరు త మ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభద్రాంగిదేవి, ఉపాధ్యాయులు సుజాతరాణి, శైలజా, జి.రాధ, వేణుగోపాల్, సరిత, జయలక్ష్మీ, పిఈటి యాదయ్య, ఆర్ట్ టీచర్ బాల్రాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మట్టితో దుర్గామాత విగ్రహాన్ని చేసిన విద్యార్థి





అందోలు,ప్రజాస్ఫూర్తి: అందోలు మండలం రోళ్లపాడ్ ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న సంపత్ అనే విద్యార్థి దుర్గామాత విగ్రహాన్ని తయారు చేసి అందరి మన్ననలు పొందారు. మట్టిలో మాణిక్యాలు అన్నదానికి నిలువెత్తు నిదర్శనం విద్యార్థి సంపత్ . చెరువులోని మట్టిని తీసుకువచ్చి శనివారం పాఠశాలలోనే దుర్గామాత ఫోటోను చూసుకుంటూ తయారు చేశారు. సంపత్ ప్రతిభకు ప్రధానోపాధ్యాయులు రాజమల్లు అభినందించారు. గ్రామస్తులు విగ్రహాన్ని చూసి ఆశ్చర్య పోయారు.

# పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య అత్యవసరం

* **విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ. వి.సుబ్బారావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రాథమిక విద్యలో పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టడం అత్యంత ఆవశ్యకమని దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ప్రణాళికలు రచిస్తున్నదని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ వి సుబ్బారావు అన్నారు.శనివారం ఉదయం బూర్గంపాడు మండలంలోని నాగినేని ప్రోలు ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్వాడీ పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి .పాటిల్ తో కలిసి పరిశీలించి అక్కడి పిల్లలతో మాట్లాడారు. అనంతరం అంగన్వాడి కార్యకలాపాల గురించి అక్కడే అంగన్వాడీ టీచర్ మరియు స్థానిక సూపర్వైజర్ తో మాట్లాడి తెలుసుకున్నారు. పిల్లలకు అందించే వివిధ రకాలైన పోషక పదార్థాలు అదేవిధంగా తల్లులకు అందించే పోషక ఆహారం గురించి తెలుసుకున్నారు. పాఠశాల ఆకర్షణీయంగా తీర్చిదిద్దటం పట్ల అక్కడి



అంగన్వాడి కేంద్ర సిబ్బందిని ప్రశంసించారు. అనంతరం అదే పాఠశాలలోని కృత్రిమ మేధ ద్వారా ఎఫ్ ఎల్ ఎన్ అభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించి ఈ కార్యక్రమం పిల్లలు అభ్యసన మెరుగుపరచుకోవటానికి గొప్ప అవకాశం అని దీనిని సమర్థవంతంగా వినియోగించి అన్ని పాఠశాలల్లో అమలయ్యేటట్లుగా చూడాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ విద్యాచందన, జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు నాగ రాజశేఖర్, సతీష్ కుమార్, సైదులు, మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ తో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా అభివృద్ధి అధికారి, సిడిపిఓలు, ఇండస్ట్రియల్ అధికారులతో, సమావేశం నిర్వహించిన ఆయన పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయటం పట్ల అందరీ అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతేగాక విద్యావ్యవస్థ పటిష్టవంతంగా నడవడానికి కావలసిన సూచనలు సలహాలను కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి .నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ నాగరాజు శేఖర్, వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా, సిడిపిఓలు, జిల్లా పారిశ్రామిక అభివృద్ధి అధికారి పాల్గొన్నారు.

## ఇల్లందు డిఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు : ఇల్లందు డిఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సందర్శించినారు.సబ్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,ఇల్లందు సీఐ సురేష్,టేకులపల్లి సీఐ సత్యనారాయణ మరియు సబ్ డివిజన్లోని ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.సబ్ డివిజన్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహన కల్పించాలని తెలిపారు.అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.భాధితులకు అండగా ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ భాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.అనంతరం డిఎస్పి కార్యాలయ పరిసరాలను పరిశీలించి,కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు.

## పంచశీల స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయరాళ్ళు, విద్యార్థినిలు వివిధ రకాల పూలతో పాఠశాల అవరణంలో పూలను పేర్చి బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ మహిళల సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు. మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇటువంటి పండగలు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ప్రతి పండగ విశిష్టత తెలియజేసేలా పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుపుతున్నామన్నారు.పాఠశాలలో చిన్నారి విద్యార్థులు,ఉపాధ్యాయునిలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి

* **సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో పండుగ వాతావరణం**
* **దాండియా నృత్యాలతో విద్యార్థుల సందడి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లోని సెయింట్ మేరీస్ హైస్కూల్లో దసరా సెలవుల్లో భాగంగా ముందుగానే బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మ చుట్టూ దాండియా ఆడుతూ పండుగ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ, దసరా పండుగల ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో సుపీరియర్ సిస్టర్ మేరీ జాన్, హెచ్ఎం సిస్టర్ రూబీ,అసిస్టెంట్ హెచ్ఎం సిస్టర్ నిర్మల ,సిస్టర్ లిల్లీ డానియల్, సిస్టర్ ఉష, ఉపాధ్యాయులు వాసుకి,కమలశ్రీ,భూదేవి ,సంధ్య రాణి,కల్పన విద్యార్థులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



## అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబురాలు

* **చైతన్య విద్యానికేతన్ హై స్కూల్ లో వైభవంగా బతుకమ్మ సంబురాలు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లో గల చైతన్య విద్యానికేతన్ హై స్కూల్ లో బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. శనివారం పాఠశాల క్యాంపస్ గ్రౌండ్ లో విద్యార్థినిలు, ఉపాధ్యాయినిలు తిరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేస్తూ సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,చైతన్య విద్యా నికేతన్ విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి పాల్గొని మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవానికి ప్రతిబింబంగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు బతుకమ్మ పండుగ దోహదపడుతుందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు ప్రతి పండుగ విశిష్ట విశిష్టత తెలియజేసేలా మన కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల విశిష్టతలను తెలియజేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మంగాదేవి, ఇంచార్జి గీత , టీచర్లు స్వప్న శరణ్య, కవిత సవిత, సుస్మిత, కృష్ణవేణి, స్వర్ణలత, శారదా, సుధా, రాణి, సంగీత, అఖిల, శుభాషిణి, శశికళ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం చెయ్యాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ , మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలను సమీక్షించారు. ఆయన, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించడం ప్రభుత్వం ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.కమిటీ సభ్యులు ప్రతి కేసును పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి,ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయ సూపర్డెంట్ హనుమంతరావు, కార్యాలయ సిబ్బంది, కమిటీ సభ్యులు సామ్యా నాయక్, లక్ష్మీ బాయి, చాట్ల రవికుమార్, లకావత్ వెంకటేశ్వర్లు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూలనే పూజించే గొప్ప పవిత్రమైన పండుగ బతుకమ్మ

**: వడ్డేపల్లి యామిని**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : దేవుడిని రోజు పూలతో పూజిస్తామని, దేవుడిని పూజించే పూలనే పూజించే గొప్ప పవిత్రమైన పండుగ బతుకమ్మ అని వడ్డేపల్లి యామిని అన్నారు. కూకట్ పల్లిలో శనివారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి యామిని మాట్లాడుతూ ప్రతీ ఒక్క మహిళ కలిసి మెలిసి ఆడుకునే పవిత్రమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పువ్వులను పూజించే సాంప్రదాయం.. తెలంగాణకు ప్రత్యేకం

: **ట్రినిటీ పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు**

\- **కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పువ్వులను పూజించే సాంప్రదాయం.. రకరకాల పువ్వులతో బతుకమ్మ పండుగ నిర్వహించడం.. తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గాంధీ పార్క్ ఆవరణలో ట్రినిటి పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. మహిళలు, విద్యార్థినీలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పండుగలలో చాలా ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. దేశ, విదేశాల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రజలు బతుకమ్మ పండుగను సాంప్రదాయపద్ధంగా నిర్వహిస్తారన్నారు. ఈ కాలంలో పూచే ప్రకృతి సిద్ధమైన పూలతో చేసి పసుపుతో గౌరమ్మ చేసి ఎంగిలిపువ్వు బతుకమ్మతో మొదలెట్టి తొమ్మిది రోజుల్లో సద్దుల బతుకమ్మ వరకు బతుకమ్మ పండుగ నిర్వహిస్తారన్నారు. ఊరూరా వాడవాడల చిన్న, పెద్దలు కలిసి బతుకమ్మ వేడుకలను చాలా ఘనంగా జరుపుకుంటారన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బతుకమ్మ సంబరాలకు హాజరు కావడం, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు, విద్యార్థినీలు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు మహిళలు, విద్యార్థినీల ఆటపాటలతో చీకటి పడే వరకు కొనసాగాయి. మహిళలు బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందంగా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ సంబరాలతో గాంధీ పార్కు ఆవరణ అంతా పండగ వాతావరణం నెలకొంది. సాంప్రదాయాలకు ప్రతికగా నిలిచిన బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా మహిళలు అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, పాఠశాల చైర్మన్ కే వి బి కృష్ణారావు, పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయ బృందం, మహిళలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రత్యేక పథకాలు

**: మంత్రి సీతక్క**



హైదరాబాద్: మహిళలు మహారాణులుగా ఉండాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ''గతంలో డబ్బుల కోసం మగవారిపై ఆధారపడే పరిస్థితి ఉండేది. మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకువచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలకు కుట్టుమిషన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారు. ఉచిత బస్సు సౌకర్యం అందిస్తుంటే.. భారత రాష్ట్ర సమితి ఈ పథకాన్ని అగౌరవపరుస్తూ మహిళలపై విమర్శలు చేస్తోంది'' అని మంత్రి సీతక్క అన్నారు.

# ప్రమాదకరమైన వృత్తి.. కల్లుగీత కార్మికుల వృత్తి

: కల్లుగీత కార్మిక సంఘం 10వ మండల మహాసభ
* నూతన కమిటీ ఎన్నిక
* కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ







చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చేతి వృత్తులలో అతి ప్రమాదకరమైన వృత్తి.. కల్లుగీత కార్మికుల వృత్తి అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి రమణ అన్నారు. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామపంచాయతీ రిక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో కల్లుగీత కార్మిక సంఘం చౌటుప్పల్ మండల 10వ మండల మహాసభ శనివారం నిర్వహించారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవి రమణ మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం ప్రాణాలకు ప్రమాదం అని తెలిసినా, కల్లుగీత కార్మిక వృత్తిని ఎంచుకుంటున్నారన్నారు. ఈ వృత్తితో గీత కార్మికులకు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, ఎందరో అంగవైకల్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, అంగవైకల్యానికి గురైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో జరుగుతున్న జాప్యం పట్ల బాధగా ఉందన్నారు. వెంటనే ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు. కల్లుగీతవృత్తితో జీవనోపాధి పొందుతున్న గీత కార్మికులను ఆధుకునే విధంగా ప్రభుత్వం గీతన్న బంధు పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీతన్న బంధు పథకంతో గీతన్నల బ్రతుకులు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రతి జిల్లాలో ఒక నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేసి గీత సంఘం యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహాసభలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగోని జయరాములు, జిల్లా అధ్యక్షుడు రాగీరు కృష్ణయ్య, చౌటుప్పల్ గౌడ సంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య గౌడ్ అధిక సంఖ్యలో కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

*** కల్లు గీత కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక**

కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీని మహాసభలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా బత్తుల లక్ష్మయ్య గౌడ్, నూతన కమిటీ అధ్యక్షునిగా మారగోని అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అంతటి అశోక్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఉష్కాగుల రమేష్‌గౌడ్, మల్లెగోని లక్ష్మయ్య గౌడ్, ఉష్కాగుల శ్రీనివాస్ గౌడ్, మారగోని మారయ్య గౌడ్, సహాయ కార్యదర్శులుగా పల్సం అంజయ్య గౌడ్, పొట్ట సాంబశివుడు గౌడ్, కోశాధికారిగా వలందాసు సతీష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని ఆవునూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు 62 మందికి పాఠశాల పధానోపాధ్యాయులు దూడం మనోహర్ చేతుల మీదుగా బిజెపి మండల అధ్యక్షుడు సౌళ్ల క్రాంతి కుమార్ సైకిళ్లను పంపిణీ చేశారు. సిఎస్ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్ కానుకగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పేద విద్యార్థుల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినం సైకిళ్లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లచ్చులు, ఎఎపి చైర్మన్ ప్యారం అనిత, ఉపాధ్యాయ బృందం, సీనియర్ అధ్యాపకులు తదితరులున్నారు.

## ఇల్లందు నియోజకవర్గ ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు..

* **బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్**





ప్రజాస్ఫూర్తి ఇల్లందు : రేపు బతుకమ్మ పండుగ ఎంగిలి పూల బతుకమ్మ తో ప్రారంభమవుతున్న సందర్భంగా ఇల్లందు నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే & బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, ఇల్లందు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న ఆడబిడ్డలకు హృదయపూర్వక బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే & బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, హరిప్రియనాయక్ మాట్లాడుతూ. మహిళలు ఎంతో ఇష్టంతో పూలను పేర్చి గౌరమ్మను తీర్చి కోరిన కోరికలు ఫలించాలనే నమ్మకంతో ఈ పండుగను ఎంతో పవిత్రంగా భావించి జరుపుకుంటారని,మాజీఎమ్మెల్యే భానోత్ హరిప్రియ నాయక్, పేర్కొన్నారు పువ్వులను పూజించే ఈ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు బతుకమ్మలను పేర్చేందుకు ఎక్కువగా తంగేడుపూలను ఉపయోగిస్తారని, అందుకు గాను తంగేడు పువ్వును రాష్ట్ర పువ్వుగా ప్రకటించి, ఈ బతుకమ్మ ప్రాధాన్యతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయ ఆచార వ్యవహారాలను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రపంచానికి చాటి చెప్పారన్నారని, అటువంటి తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను మన ఆడబిడ్డలు ఎంతో ఆనందోత్సవాల నడుమ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.12 కోట్ల గంజాయి స్వాధీనం



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో తరలిస్తున్న రూ.12 కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. దుబాయి నుంచి వచ్చిన ప్రయాణికురాలి వద్ద దీన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## మారుమ్రోగిన ముస్తాబాద్

* **మండలంలో అంగరంగ వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముందస్తు బతుకమ్మ వేడుకలతో ముస్తాబాద్ మండలం మారుమోగింది. నేడు చిన్న బతుకమ్మను పురస్కరించుకొని ముస్తాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. తీరొక్క పూలతో విద్యార్థినీలు, ఉపాధ్యాయినీలు బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకు వచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఏర్పాటు చేసి, బతుకమ్మ ఆట పాటల నడుమ పండగ వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. ముందస్తు బతుకమ్మ వేడుకలతో బతుకమ్మ పండగ వాతావరణం మండలంలో ప్రారంభమైంది. ముస్తాబాద్ అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే సొంతమని, ప్రపంచంలో మరెక్కడా కూడా ఇలా ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యాయులు బాధవేని అంజా గౌడ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## కందిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

* **రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు...**
* **కన్ సాన్ పల్లి లో పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం**

అందోలు, ప్రజాస్ఫూర్తి : కంది పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు .కే.అరుణ, డా.ఏ.నిర్మల మరియు కే.రాహుల్ విశ్వకర్మ లు సూచించారు. శనివారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కంది పంట, మామిడి తోట, మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘం వంటి అంశాలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఉండటం వల్ల రైతులందరూ స్వయం ఉపాధి మరియు ప్రతి ఒక్క రైతు సాగులో మెలకువలు నేర్చుకోవచ్చన్నారు. ముఖ్యంగా మామిడి తోటలో ఈ మాసంలో చేపట్టాల్సిన పోషక యాజమాన్యం గురించి వివరించారు. మామిడిలో పోషక లోపాలు ఏర్పడకుండా ప్రతిపోషకాన్ని అవసరాన్ని బట్టి అందించాలి. తోటను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అలాగే మల్చింగ్ పద్ధతి పాటించాలన్నారు. ప్రధానంగా కంది పంట శాఖీయ దశలో ఉంది కావున రైతులందరూ సస్యరక్షణ చర్యలు పాటించాలి. కందిని ఎక్కువగా ఆశించే మారుకా మచ్చల పురుగు నివారణ కొరకు క్లోరిపైరీపాస్ అనే మందును లీటర్ నీటికి 2 మీ. లీ చొప్పున కలిపి పిచికారి చేయాలి. రసం పీల్చు పురుగుల నియంత్రణ కొరకు ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రధాన పంటలైన వరి, పత్తి, కంది పంటలకు నష్టం జరగకుండా సరైన సస్యరక్షణ పోషకాల యాజమాన్యంతో పాటు మెలకువలు పాటించాలన్నారు. కార్యక్రమంలోయంగ్ ప్రొఫెషనల్ 1 ఎస్. శ్రీకాంత్, మాజీ సర్పంచులు శేరి మాణిక్ రెడ్డి, చిలుకంటి వెంకటేశం, మాజీ వార్డు సభ్యులు బగిలి గజేందర్ రెడ్డి, నోమన్నగారి మాధవరెడ్డి, శేరి వినోద్ రెడ్డి, మండల కురుమ సంఘం నాయకులు సంగమేశ్వర్, బచ్చు ప్రభాకర్, కాడెం శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చొరవ

* **ఒక్క రోజులోనే వేతనాల్లో కోత ఉత్తర్వులు రద్దు**
* **జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు మాణయ్య**



అందోలు, ప్రజాస్ఫూర్తి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డిని చొరవతో రెసిడెన్షియల్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల వేతనాల్లో కోత విధిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులను రద్దు చేయించినట్లు జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు ఎ. మాణయ్య తెలిపారు. అందోలు మండల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమాచారం లేకుండా తమ వేతనాల్లో కోత విధిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేయడంతో తీవ్ర ఆందోళనతో పీఆర్టీయూ సంగారెడ్డి జిల్లా శాఖను సెప్టెంబర్ 18 నాడు సంప్రదించగా అప్పటికప్పుడు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అధికారులతో మాట్లాడి పాత వేతనాలు ఇప్పిస్తామని ఎలాంటి ఆందోళన చెందవద్దని అభయమిచ్చారని తెలిపారు.. రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి కూడా మైనారిటీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్య పట్ల సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్య తీవ్రత గుర్తించి ఎమ్మెల్సీ చొరవతో సాయంత్రం వరకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు పరచి తిరిగి పూర్వవేతనాలు ఇచ్చుటకు అంగీకరించడంతో మైనారిటీ ఉపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ ఉపాధ్యాయులు పీఆర్టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎ.మాణయ్యను జోగిపేట ఉన్నత పాఠశాలలో కలిసి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు






మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఉప్పల్ డిపో ఎదురుగా , బోడుప్పల్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో అలరారుతూ పూలతో అందమైన బతుకమ్మలను సిద్ధం చేశారు. పాటలు పాడుతూ, నృత్యాలతో ఆడిపాడుతూ పూల పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సమ అశోక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సమ శోభా రాణి, డైరెక్టర్ సమ సాయి అభిషేక్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. వారు మాట్లాడుతూ “బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయాల ప్రతీక. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో ఐక్యత, ఆనందం, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి” అని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను వివరించి, సాంప్రదాయాలను కాపాడుకోవడం యొక్క అవసరాన్ని తెలియజేశారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పండుగ వాతావరణం మరింత అంగరంగ వైభవంగా మారింది.

# గ్రేటర్ ఎక్స్ లెన్సీ అవార్డు అందుకున్న నాగా సీతా రాములు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు కు ప్రతిష్టాత్మక గ్రేటర్ ఎక్సలెన్సీ అవార్డు 2025 వరించింది. 3తరాల నుండి కాంగ్రెస్ పార్టీ నేపథ్యమున్న కుటుంబంలో జన్మించిన నాగా సీతారాములు 1989లోనే ఎన్.ఎస్.యు.ఐ ఖమ్మం జిల్లా జనరల్ సెక్రటరీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నాగా సీతారాములు యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, ఓబీసీ జిల్లా కన్వీనర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, టీపీసీసీ సభ్యులు, వంటి పదవులు నిర్వర్తించి నేడు టీపీసీసీ జనరల్ సెక్రటరీగా, యాదవ విద్యావంతుల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గోకుల కృష్ణ ట్రస్ట్ చైర్మన్, బీసీ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గా సేవలందిస్తున్నారు. కోవిడ్ 19 సమయంలో లో తమ ఎన్ఎస్సార్ ట్రస్ట్ ద్వారా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఏన్నో సేవలను అందించి, పార్టీలకు అతీతంగా ప్రజల మన్ననలు పొందారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు, పార్టీ పిలుపు మేరకు రచ్చబండ, గడప గడప ప్రోగ్రామ్స్ ద్వారా పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్, బీజేపీ పాలనలో పార్టీ పిలుపు మేరకు పెట్రోల్, డిజిల్, నిత్యవసరాల వస్తువు ధరల పెరుగుదలపై ఎన్నో ధర్నాలు, నిరసనల చేసిన నాగా సీతారాములు రాహుల్ గాంధీతో పాటుగా భారత్ జోడో యాత్రలో భాగంగా మక్తల్ నుండి మహారాష్ట్ర శివాజీ టెంపుల్ వరకు 13 రోజులు 385 కిమీ, రెవంత్ రెడ్డి పాదయాత్ర, మల్లు భట్టి పాదయాత్రలో, సైకిల్ యాత్ర , ప్రజాస్వామ్య



పరిరక్షణ యాత్రల్లో పాల్గొన్నారు. తన సామాజిక సేవల ద్వారా అందరివాడుగా ఉమ్మడి జిల్లా వాసులకు సుపరిచితుడిగా పేరు తెచ్చుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకుడిగా ప్రజాసేవ చేస్తున్నాడు. ఎల్లలు దాటిన ఆయన సేవలను గుర్తించిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ ఇండియా) సంస్థ నాగా సీతారాములు ను గ్రేటర్ ఎక్స్ లెన్సీ అవార్డుకు చైర్మన్ చైతన్య జంగా ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్లోని కంట్రీ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ ఇండియా సంస్థ చైర్మన్ చైతన్య జంగా తోపాటు సెక్రెటరీ వీఎస్ వర్మ, మీడియా చైర్మన్ కిరణ్ బేజాడీ, డైరెక్టర్ చంద్రశేఖర్, కంట్రీ క్లబ్ అధినేత రాజీవ్ రెడ్డి, అనుప్రసాద్ ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కాగా, ప్రతిష్టాత్మక గ్రేటర్ ఎక్స్ లెన్సీ అవార్డు అందుకున్న టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగా సీతారాములు ను పలువురు రాజకీయ నాయకులు, కొత్తగూడెం పట్టణ ప్రముఖులు అభినందించారు.

# బతుకమ్మ, దసరాకు ఊర్లకు వెళ్తే తస్మాత్ జాగ్రత్త

* **పోలీసు శాఖ సూచనలు తప్పక పాటించండి**
* **పండగ సమయంలో పిల్లలను గమనిస్తూ ఉండాలి**
* **ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**




ముస్తాబాద్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణలోనే అతి పెద్ద పండగ అయిన బతుకమ్మ, అదేవిధంగా దసరా పండలను పురస్కరించుకొని ఎవరైనా వారి వారి సొంత ఊర్లకు వెళ్తే పోలీసు శాఖ సూచనలు తప్పక పాటించాలని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో సూచించారు. ఊర్లకు వెళ్లే సమయంలో ఇంట్లో ఉన్న బంగారం, నగదును లాకర్లలో లేక బ్యాంక్‌లలో భద్ర పరుచుకోవాలని సూచించారు. తాళం వేసి ఊరికి వెళ్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి ఇండ్ల పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోవాలని, చైన్‌తో తాళం వేయాలని సూచించారు. అంతేగాకుండా పక్కింటి వారికి సమాచారం ఇచ్చి, నిత్యం గమనించాలని వారికి చెప్పాలని సూచించారు. ఇంట్లోని ముందు గదిలోలైట్ వేసి ఉంచాలని, ఇంటి ముందు రోజూ ఊడ్చి ముగ్గు పెట్టే విధంగా ఎవరినైనా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తాళంను కర్టన్‌తో కవర్ చేయాలని సూచించారు. పండగ సెలవుల నేపథ్యంలో చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి వేళల్లో మరింత గస్తీ పెంచుతామని, పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రజలు సహకరించి పోలీసు శాఖ సూచనలను పాటించాలని అన్నారు. అంతేగాకుండా ఊర్లకు వెళ్లే సమయంలో బస్సులలో, ఇతర వాహనాలల్లో జనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో దొంగతనాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనాలకు వెళ్లే సమయంలో పిల్లలను కుంటలు, చెరువులు, నదుల వద్దకు తీసుకెళ్లకపోవడమే మంచిదని, ఒకవేళ తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తే పిల్లలను నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు. అంతేగాకుండా ఊర్లకు వెళ్లి సమయంలో తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లనివ్వవద్దని సూచించారు. ఆడుకునేందుకు వెళ్లిన క్రమంలో ఎక్కువ దూరం వెళ్లనివ్వవద్దని, గమనించుకుంటూ ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించి, అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

# పాల్వంచ నారాయణ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

* **దుర్గాదేవి వేషధారణలో మెప్పించిన విద్యార్థినులు**
* **ఏడడుగుల బతుకమ్మ అలంకరణ ప్రత్యేక ఆకర్షణ**
* **బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా**






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో శనివారం నాడు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో, దుర్గాదేవి వేషధారణలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఏడడుగుల బతుకమ్మ ప్రత్యేకంగా అలంకరించబడింది.ఈ సందర్భంగా ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ మాట్లాడుతూ ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను జరుపుకుంటారని, మొదటి రోజు ఎంగిలిపువ్వు బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మగా నిర్వహిస్తారని వివరించారు. ఈ పూల పండుగ దసరా పండుగకు రెండు రోజుల ముందు జరిగే ప్రత్యేకతను ఆయన గుర్తుచేశారు.ఆర్ఐ క్రాంతి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, ప్రపంచానికి తెలంగాణ గర్వకారణమని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు సంప్రదాయాలపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ రుచిత, పద్మ, ఏఓ వీర, పీఈటి వినయ్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# తెలంగాణలో బతుకమ్మ సంబరాలు.. షెడ్యూల్ ఇలా..

హైదరాబాద్: బతుకమ్మ పండగను పెద్దఎత్తున నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఈమేరకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 21న హైదరాబాద్ శివారులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు.

* 22న హైదరాబాద్‌లోని శిల్పరామం, మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్ద సంబరాలు నిర్వహించనున్నారు.
* 23న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, 24న భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కరీంనగర్ సిటీ సెంటర్‌లో వేడుకలు ఉంటాయి.





* 25న భద్రాచలం, అలంపుర్ జోగులాంబ ఆలయాల్లో పండగ చేయనున్నారు.
* 26న నిజామాబాద్‌లోని అలీసాగర్, మెదక్, ఆదిలాబాద్‌లలో సంబరాలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో సైకిల్ ర్యాలీ ఉంటుంది.
* 27న ఉదయం నెక్లెస్ రోడ్‌లో మహిళల బైక్ ర్యాలీ, సాయంత్రం ఐటీ కారిడార్‌లో బతుకమ్మ కార్నివాల్ ఉంటాయి.
* 28న నగరంలోని ఎల్బీ స్టేడియంలో 50 అడుగుల బతుకమ్మ, 10 వేల మందికిపైగా మహిళలతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా భారీ వేడుకలు నిర్వహించనున్నారు.
* 29న పీపుల్స్ ప్లాజాలో ఉత్తమ బతుకమ్మ పోటీలు, స్వయం సహాయక సంఘాలతో కార్యక్రమాలు చేపట్టనున్నారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతంలో బతుకమ్మ వేడుకలు ఉంటాయి.
* 30న ట్యాంక్‌బండ్‌పై గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్, వింటేజ్ కార్ల ర్యాలీ, బతుకమ్మ లైటింగ్ ప్రదర్శన, జపనీయుల ప్రదర్శన (ఇకెబానా), సెక్రటేరియట్‌పై 3డీ మ్యాప్ లేజర్ షో నిర్వహించనున్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ ఆర్ట్ క్యాంప్ ఉంటుంది.

## ఐదేళ్లలో కోటి మంది మహిళలను
# కోటీశ్వరులను చేస్తాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. గ్రేటర్‌పరిధిలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ''మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలను ఇప్పటికే 150 ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. మరో 450 బస్సులకు యజమానులను చేయబోతున్నాం. మహిళలు ఇక వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు'' అని భట్టి అన్నారు.

## ట్రంప్ ఉత్తర్వులు..
# ఉమ్మడి ఏపీలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: హెచ్ 1బీ వీసా రుసుం పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల వల్ల భారతీయ టెక్ కంపెనీలకు తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలంగాణ ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''అన్ని టెక్ కంపెనీలకు నష్టం వాటిల్లేలా, మెరుగైన ఉద్యోగాలు పొందాలనుకునే వారి ఆశలపై నీళ్లు చల్లేలా ట్రంప్ ఉత్తర్వులు ఉన్నాయి. ఇప్పటికే 50 శాతం టారిఫ్‌లతో ట్రంప్ సర్కారు భారత్‌కు తీవ్ర నష్టం చేస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? దౌత్యపరంగా




ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరపడంలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలోని రాష్ట్రాలతో సంబంధాల్లోనూ మోదీ సర్కారు పూర్తిగా విఫలమైంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల విషయంలో ప్రధాని మోదీ వైఖరి సరిగా లేదు. అమెరికాలోని టెక్ కంపెనీలు కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ట్రంప్ నిర్ణయంపై కేంద్రం నుంచి దౌత్య చర్యలు లేవు. ఉమ్మడి ఏపీలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై పెద్దఎత్తున ప్రభావం ఉంది. ట్రంప్ నిర్ణయంతో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు మూసుకొని వెళ్లిపోవాల్సిందే. విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్ తగ్గితే భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. హెచ్ 1బీ వీసా పొందుతున్న వారిలో టెక్ సంబంధిత ఉద్యోగులే అధికం'' అని శ్రీధర్‌బాబు అన్నారు.



## దసరా సెలవులు..
# స్వస్థలాలకు బయల్దేరిన నగరవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్: దసరా పండగ నేపథ్యంలో నగరవాసులు స్వస్థలాల బాట పట్టారు. సోమవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. మరోవైపు.. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రమే పట్నం వాసులు పల్లెబాట పట్టారు. దీంతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది. అబ్దుల్లాపుర్ మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజా, పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వాహనాలు బారులు తీరాయి.

# రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఫోబియా: రామచందర్‌రావు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నిందించడం మానుకోవాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి భాజపా ఫోబియాతో పాటు కిషన్‌రెడ్డి ఫోబియా కూడా అంటుకుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాల డబ్బులు ఇవ్వలేని రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి వెయ్యి కోట్లు ఎలా ఇస్తారని నిలదీశారు. ''విద్యా వ్యవస్థ పూర్తిగా దుర్భర పరిస్థితుల్లోకి వెళ్లింది. రేవంత్ రెడ్డికి దిల్లీకి వెళ్లడమే సరిపోతోంది. శ్యామ్ పిట్రోడా ట్రైనింగ్ ఇవ్వడం వల్లే రాహుల్ గాంధీ అలా తయారయ్యారు. ఓట్ల చోరీ అనే కొత్త నాటకాన్ని తెరమీదకు తెచ్చి దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బోగస్ ఓట్లు వేరు.. ఓట్ల చోరీ వేరు. ఈ చిన్న విషయం కూడా తెలియని రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంటారు.. హైడ్రోజన్ బాంబ్ అంటారు.. ఇంకేదో అంటున్నారు. ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారమే కాళేశ్వరంపై పీసీ ఘోష్ విచారణ చేపట్టింది. కమిషన్ విచారణలో నిందితులు ఎవరన్నది తేల్చిందా? రాజకీయ నేతలను ఎవరినైనా అరెస్ట్ చేశారా?'' అని రామచందర్‌రావు ప్రశ్నించారు.



# సంస్కృతి లో సంబురంగా బతుకమ్మ



(ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట) : జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు కనుల పండుగ జరిగాయి. తీరకపోవులను తీసుకొచ్చి టీచర్లు బతుకమ్మలు పేర్చారు. విద్యార్థులు బతుకమ్మలు చేతబుని ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం చప్పట్లతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటలాడి పాటలు పాడారు.














# బతుకమ్మకి... సిద్ధమేనా?

పూజ ఏదైనా భక్తి శ్రద్ధలతో నమస్కరించడం పరిపాటి. బతుకమ్మ దగ్గరికి వచ్చేసరికి పాటలు పాడుతూ నృత్యం చేస్తూ అమ్మవారిని కొలవడం కనిపిస్తుంది. ఇక్కడ వయసుతో సంబంధం ఉండదు. గృహిణి, ఉద్యోగిని, పల్లె యువతి, ఆధునిక మహిళ అన్న భేదాలే కనిపించవు. అన్నీ మరిచి అందరితో కలిసి ఆడిపాడటమే ఈ పండుగ స్ఫూర్తి. ఏ ఇంటికైనా అమ్మాయే మహాలక్ష్మి. ఆమె చూడముచ్చటగా ముస్తాబై ఆడిపాడుతోంటే అంతకుమించిన ఆనందం ఏముంటుంది? దొంతరల్లా పేర్చిన పూలు... వాటి చుట్టూ అమ్మాయిల నవ్వుల గలగలలు. అక్కడ ఆడేది ఆమె పాదాలకున్న గజ్జెలేనా? కొంగుకు ముడేసిన దారాలు, పూసలు, చేతికున్న గాజులు, పూలతో అలంకరించిన జడ, నుదుటిన పాపిటబిళ్ల... ప్రతిదీ ఆమెతోపాటుగా నర్తిస్తాయి. సందడి చేస్తాయి. కాబట్టే, ఎవరిది అత్యంత అందమంటే ఓటేయడం కాస్త కష్టమే! ఒక్కరోజు వేడుకైతే ఫలానా చీర, డ్రెస్సు అని ఠక్కున ఎంచుకోవచ్చు. తొమ్మిదిరోజులు జరిగే వేడుక మరి. ముస్తాబు మారాల్సిందే, ఆకట్టుకోవాల్సిందే. అలా కావాలంటే ముందుగా సిద్ధమవ్వడమే మార్గం!

ఎంత ఫ్యాషన్‌ని అనుసరించేవారైనా... ఈ పెద్దపండుగకి మాత్రం సంప్రదాయానికే చోటిచ్చేస్తారు అమ్మాయిలు. పట్టుపరికిణీలు, చీరలకే ఓటేస్తారు. తొమ్మిది రోజులు... రోజుకో రకం... ఆరోజుకారోజు ఎంచుకోవడమంటే తికమక సాధారణమే. ఒకేలా రోజూ కనిపించినా మనకీ బోరే. కాబట్టి, ఏరోజు



ఏమిటన్నది ముందే నిర్ణయించుకోండి. అసలే పూల పండగ... పూలతో పోటీపడుతూ పసుపు, ఆకుపచ్చ, నారింజ రంగులను ఎంచుకోవచ్చు. లేదు ముదురు రంగులే ఇష్టమన్నా... కాంట్రాస్ట్ కూడా ఆకట్టుకునేదే.

అయితే ఒకరోజు లేత మరోరోజు ముదురు రంగులకు ప్రాధాన్యమివ్వండి. నేడు పెద్ద డిజైన్లు వేస్తే, రేపు చిన్న బుటీలు... ఇలా ప్లాన్ చేసుకున్నా మంచిదే. ప్రతిరోజూ సరికొత్తగా కనిపిస్తారు. అన్నిరోజులూ బంగారమే పెట్టాలన్నా కుదరదు. కాబట్టి, ఫంకీ నగల్లో వేటిని జత చేయొచ్చో చూసుకోండి. గాజులనీ తగ్గట్టుగా సిద్ధం చేసుకోవాలి. పట్టు, సిల్క్, కాటన్... ఎంచుకున్నది ఏదైనా సౌకర్యం తప్పక చూసుకోవాలి. అసలే ఆడిపాడే వేడుక ఏమాత్రం అసౌకర్యంగా ఉన్నా ఆస్వాదించడం కష్టమే. చీరలోని వర్ణాలను బట్టి, రంగురంగుల బొట్లని తీర్చిదిద్దుకున్నా చూడటానికి బాగుంటుంది. ఆలోచించాలే గానీ ముత్యాలు, రాళ్ల బొట్టుబిళ్లలూ పాపిట బిళ్లగా మారతాయి. లేసులూ నడుముకు వడ్డాణమవుతాయి. భిన్న రంగుల పూలతోనూ మాయ చేయొచ్చు. అయితే ముందస్తుగా ప్రణాళిక వేసుకున్నప్పుడే అనుకున్న లుక్ సాధ్యమవుతుంది. కాబట్టి, ఏరోజు ఎలా సిద్ధమవ్వాలో ముందే చూసుకోండి.

ప్రకృతి, మగువ ఒకటే అని చెబుతారు. ప్రకృతికి గుర్తుగా... గౌరీ దేవి మారురూపుగా ఎలా బతుకమ్మ పూలను పూజించినా... ఇది మన పండుగ. అమ్మాయిల వేడుక. మనదైన రోజును నిర్వహించుకోవడానికి ఆ మాత్రం ప్రణాళిక కావాలి. అప్పుడే మనసూ కుదుటపడుతుంది. మనం కోరుకునే ఆనందమూ దక్కుతుంది. కాబట్టి... ఈ వేడుకను అందంగా, ఆనందంగా ఆస్వాదించేయండి మరి!

# పులియబెట్టు...

## కుంగుబాటుని దూరంపెట్టు!



ప్రసవానంతరం కొంతమంది మహిళల్లో కుంగుబాటు చూస్తుంటాం. అయితే... మన ఆహారం పేగు బ్యాక్టీరియా సంబంధం కూడా దీనిపై ప్రభావం చూపుతుందని క్యోటో యూనివర్సిటీ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా పరిశోధకులు 344మంది తల్లులపై అధ్యయనం చేశారు. వారిలో నిద్ర నాణ్యత, హార్మోన్ల సమతౌల్యం, చిరాకు... వంటి వాటితోపాటు వారి మలం నమూనాలనూ విశ్లేషించారు. పేగు బ్యాక్టీరియా వైవిధ్యం తక్కువగా ఉన్న వారిలో డిప్రెషన్ ముప్పు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అదే సోయా, పులియబెట్టిన ఆహారాలు, పాలు, పుట్టగొడుగులు, పండ్లు, కూరగాయలు వంటివి అధికంగా తీసుకున్న అమ్మల్లో ఈ కుంగుబాటు స్థాయిలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. అందుకే, ప్రసవం తరవాత అమ్మలు జీర్ణవ్యవస్థకు మేలుచేసే ఈ సోయ్ అండ్ ఫెర్మెంటెడ్ ఫుడ్ డైట్ (ఎస్ఎఫ్‌డీ)ని అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు శాస్త్రవేత్తలు.

### 'గీత' పవన్ కళ్యాణ్ 'ఓజీ'లో
# శ్రియా రెడ్డి పవర్ ఫుల్ లుక్

**'ఓజీ' నుంచి శ్రియా రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల**

**సినిమాలో 'గీత' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న శ్రియా రెడ్డి**

**చీరకట్టులో కోపంగా తుపాకి ఎక్కుపెట్టిన పోస్టర్‌కు మంచి స్పందన**

**సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**




**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా, యువ దర్శకుడు సుజిత్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా ఈ సినిమా నుంచి నటి శ్రియా రెడ్డి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో శ్రియా రెడ్డి 'గీత' అనే కీలక పాత్ర పోషిస్తున్నారు. విడుదలైన పోస్టర్‌లో ఆమె చీరకట్టులో కనిపిస్తూనే, తీవ్రమైన కోపంతో తుపాకి ఎక్కుపెట్టి కనిపించారు. ఈ ఇంటెన్స్ లుక్ సినిమాలోని ఆమె పాత్ర ఎంత శక్తివంతంగా ఉండబోతుందో తెలియజేస్తోంది. అయితే, గీత అంత ఆగ్రహంతో ఎవరిపై గన్ గురిపెట్టిందనే విషయంపై ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే మరో ఐదు రోజులు ఆగాల్సిందేనని తెలుస్తోంది.

ఈ సినిమాతో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్‌కు పరిచయం అవుతుండగా, ప్రియాంకా అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన అర్జున్ దాస్ బాక్సింగ్ పోస్టర్‌కు కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రకాశ్ రాజ్, శామ్ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. 'ఓజీ' సెప్టెంబర్ 25న తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



Nabha Natesh

# గ్లామర్ షోలో నభా నటేష్ రూటే సపరేటు

టాకీస్: గ్లామర్ ఫోటో షూట్స్ చేయడంలో, గ్లామర్ షో చేయడంలో నభా నటేష్ రూటే సపరేటు. తగ్గేదే లేదన్నట్టు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫోటోషూట్స్ చేస్తూ ఉంటారు. బాడీకాన్ థై హై స్లిట్ డ్రస్ లో నభా నటేష్ లేటెస్ట్ ఫోటోషూట్ చేశారు. సినిమాలతో కంటే గ్లామరస్ ఫోటోషూట్లతో నభా నటేష్ సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. 'నన్ను దోచుకుందువటే' మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ నభా నటేష్ అంతకు ముందు కొన్ని కన్నడ సినిమాల్లో మెరిసింది అందాల తార. పూరి జగన్నాథ్ శరకక్కించిన "ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. తన అందం నటనతో ఆకట్టుకుని.. వరుసగా చాన్స్ అందుకుంది. డిస్కో రాజా. అదుగో, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో తదితర సినిమాల్లో నభా అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. అయితే కెరీర్ మంచి ఫామ్లో ఉండగానే యాదెంట్ కారణంగా సినిమాలకు దూరమైన ఈ వయ్యార్.. చివరిగా ప్రియదర్శికి జోడీగా 'డార్లింగ్' మూవీలో నటించింది. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బీజీగా ఉంటుంది. లేటెస్టుగా నభా నటేష్ చేతిలో రెండు పాన్ ఇండియా సినిమాలు ఉన్నాయి. ఒకటి యంగ్‌హీరో నిఖిల్ 'స్వయంభూ'. మరొకటి 'నాగబంధం' మరికొన్ని మూవీస్ చర్చల దశలో ఉన్నాయట. మరోవైపు సోషల్ మీడియాతోనే ఎక్కువ సమయం గడుపు తోంది ఈభామ గ్లామర్ ఫొటో షూట్స్ చేస్తూ యువతని ఆకర్షిస్తోంది. తాజాగా సభా నటేష్ జైన్ లో గ్లామర్ ప్రదర్శిస్తూ ఏంజిల్ లా పెరిసిపోతోంది. ఇన్స్టా వేదికగా షేర్చేసిన ఈ ఫొటోలకు 'గ్లామ్ విసిగిపోయాను.. మిలియన్ సంవత్సరాల్లో కాదు' అంటూ క్యాప్ష న్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. గ్లామర్ షోలో సభనటీష్ రూటే సపరేటు.. అస్సలు తగ్గేదేలే అంటూ ఫాన్స్ పోస్టు పెడుతున్నారు.



Rashmika Mandanna

# బాలీవుడ్ భారీ ఫ్రాంచైజీలో రష్మిక ఎంట్రీ..

టాకీస్: బాలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన క్రిష్ ఫ్రాంచైజీ నాల్గవ భాగం (క్రిష్ 4)పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో హీరోగా హృతిక్ రోషన్ నటించనుండగా, దర్శకుడిగానూ ఆయనే బాధ్యతలు చేపట్టబోతున్నారని సమాచారం. అంతే కాదు ఈ చిత్రం 2026లో సెట్స్‌పైకి వెళ్లి, 2027లో ప్రేక్షకుల ముందుకు రానుందట. గత మూడు సినిమాల మాదిరిగానే ఇందులో కూడా సూపర్ హీరో ఎలిమెంట్స్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయి. ఇక తాజాగా ఈ మూవీలో హీరోయిన్‌గా.. టాలీవుడ్ నేషనల్ క్రష్ రష్మిక మందన్నాను ఎంపిక చేసే దిశగా యూనిట్ సీరియస్‌గా ఆలోచిస్తోందని బాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇప్పటికే రష్మికతో బృందం సంప్రదింపులు ప్రారంభించినట్లు సమాచారం. ఆమెకు కథ, పాత్ర నచ్చితే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. క్రిష్ 4 భారీ స్థాయిలో రూపొందనున్న నేపథ్యంలో, రష్మిక ఎంట్రీ ప్రాజెక్ట్‌కు మరింత ఆకర్షణను తీసుకురావడం ఖాయం. ఇక రష్మిక హృతిక్ జోడీగా స్క్రీన్‌పై కనిపిస్తే అది కొత్త ఫ్రెష్ కాంబినేషన్ అవుతుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విశేష అభిమానులను సంపాదించిన రష్మికకు ఇది బాలీవుడ్‌లో మరింత స్థాయిలో గుర్తింపుని తెచ్చే అవ కాశం అని చెప్పవచ్చు.

# నాగార్జున శివ..మూవీ రీరిలీజ్



**టాకీస్:** కొన్ని సినిమాలు ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోతాయి. వాటి లోని సన్నివేశాలు ఎప్పటికీ ట్రెండింగ్‌లో ఉంటుంటాయి. అలాంటి వాటిలో ఒకటి 'శివ'. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా నాగార్జున దీని రీ రిలీజ్ తేదీని ప్రకటించారు. నవంబర్ 14న ఈ సినిమా 4కే వెర్షన్‌లో విడుదల కానున్నట్లు- తెలిపారు. 1989లో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై 'శివ' విడుదలై టాలీవుడ్‌లో చరిత్ర సృష్టించింది. 'శివ' సినిమాకు ముందు దీని తర్వాత అనేంతగా ప్రభావం చూపింది. దీని రీరిలీజ్ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. 'కొన్ని సినిమాలు తరాలు మారినా నిత్యనూతనంగానే ఉంటాయని నాన్న అనే వారు. అలాంటి చిత్రాల్లో 'శివ' కూడా ఒకటి. ఇప్పుడీ సినిమాను 4కేలో రిలీజ్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు ఇది మా నివాళి' అని తెలిపారు. మాఫియా నేపథ్యంలో కాలేజీ కుర్రాళ్ల మధ్య జరిగే రాజకీయాలపై ఈ సినిమా రూపొందింది. నాగార్జున సరసన అమల నటించిన ఈ చిత్రంలోని పాటలు నేటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి.



# ఆస్కార్ రేసులో పలు తెలుగు చిత్రాలు

టాకీస్: ప్రపంచ వ్యాప్తంగా ఆస్కార్ అవార్డులకు ఉండే క్రేజ్ ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సినిమా రంగం, కళా రంగంలో ఉన్న ప్రతీ ఒక్కరూ ఆస్కార్ తాకాలనే కోరిక ఉంటారు. కానీ ఆస్కార్ దక్కడం అంటే మామూలు విషయం కాదు. ఇక మన దేశం నుంచి ప్రతీ ఏడాది ఆస్కార్ కోసం చాలానే చిత్రాలు పోటీ- పడుతుంటాయి. కానీ అది అంత సులభం కాదు. అయితే.. ఆస్కార్ రేసులో తెలుగు చిత్రాలు పోటీ-పడనున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి సంక్రాంతికి వస్తున్నాం, కన్నప్ప, పుష్ప 2, గాంధీ తాత చెట్టు-, కుబేర సినిమాలు ఆస్కార్‌కి ఎంపికయ్యాయి. 2025 ఆస్కార్ అవార్డులకు భారత్ తరపున అధికారిక నామినేషన్ పొందాయి. ఇప్పటికే ఈ చిత్రాలు భారీ రికార్డులు సాధించాయి. ఎఫ్ 2,ఎఫ్ 3 వంటి సూపర్ హిట్స్ తర్వాత విక్టరీ వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. పక్కా ఫ్యామిలీ ఎంటర్ -టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. దీంతో సంక్రాంతికి వస్తున్నాం సినిమా రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అల్లు అర్జున్ హీరోగా భారీ అంచనాలతో రూపొందించిన పుష్ప సెకండ్ పార్ట్ సినిమా గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. పుష్ప ది రూల్ పేరుతో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.



# కొత్త ప్రయాణం మొదలు పెట్టిన సన్నీ లియోన్

**నిర్మాతగా కొత్త ప్రయాణం మొదలుపెట్టిన సన్నీ లియోన్**

టాకీస్: వెండితెరపై తన గ్లామర్‌తో, ప్రత్యేక గీతాలతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటి సన్నీ లియోన్ తన కెరీర్‌లో ఓ కొత్త అడుగు వేశారు. కేవలం నటిగానే కాకుండా ఇప్పుడు నిర్మాతగా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు విక్రమాదిత్య మోత్వానే దర్శకత్వంలో రానున్న ఓ వెబ్ సిరీస్‌కు ఆమె నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని సన్నీ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ గురించి సన్నీ లియోన్ మాట్లాడుతూ, "ఇది నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందుతున్న సిరీస్. స్క్రిప్ట్ వినగానే ఎంతో స్ఫూర్తి పొంది, వెంటనే ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావాలని నిర్ణయించుకున్నాను. ఇలాంటి ఒక మంచి కథతో నిర్మాతగా నా ప్రయాణం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన కెరీర్‌లో ఇది ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వెబ్ సిరీస్‌ను కేవలం దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నత ప్రమాణాలతో నిర్మించనున్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలను సహజంగా పండించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.